సాక్షి
నల్లగొండ
గురువారం ౹ 22 ౹ ఆగస్టు ౹ 2024



త్రికూటాలయం ఆనవాళ్లు..
డిండి మండలం రాహమంతాపూర్ శివారులో కాకతీయ కాలం నాటి త్రికూటాలయం ఆనవాళ్లు ఉన్నాయి. - 8లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం : 590 అడుగులు	
ప్రస్తుత నీటి మట్టం	: 589.20 అడుగులు
ఇన్‌ఫ్లో	: 32457 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	: 46290 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	: 28930 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	: 8131 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	: 6758 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	: 1800 క్యూసెక్కులు
వరద కాల్వకు	: 600 క్యూసెక్కులు

మూసీ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం : 645 అడుగులు	
ప్రస్తుత నీటి మట్టం: 643.50 అడుగులు	
ఇన్‌ఫ్లో	: 3,757 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	: 1,936 క్యూసెక్కులు
ఎడమకాల్వకు	: 216.86 క్యూసెక్కులు
కుడికాల్వకు	: 168.89 క్యూసెక్కులు

న్యూస్‌రీల్

మూసీ తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



మూసీ గేట్లు ఎత్తేందుకు స్విచ్ ఆన్ చేస్తున్న ఎడమ కాల్వ ఏఈ స్వప్న

కేతేపల్లి : మూసీ గేట్లు ఎత్తి దిగువకు నీటిని వదిలినందున నల్లగొండ, సూర్యాపేట జిల్లాలోని మూసీ తీర ప్రాంత గ్రామాల రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మూసీ డీఈ చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. మూసీ వాగు వెంట మోటార్లు అమర్చుకుని వ్యవసాయం చేసుకునే వారు వాటిని తొలగించి ఎగువ ప్రాంతాలకు తరలించుకోవాలన్నారు. గొర్రెల, పశువుల కాపర్లు, రైతులు, జాలర్లు మూసీ వాగులోకి వెళ్లవద్దని సూచించారు.

పలువురు ఏడీఏల బదిలీ

నల్లగొండ అగ్రికల్చర్ : జిల్లా వ్యవసాయ శాఖలో పలువురు ఏడీఏలు బదిలీ అయ్యారు. నల్లగొండ డీఏఓ కార్యాలయంలో పనిచేస్తున్న హుసేన్‌బాబు హైదరాబాద్ కమిషనరేట్‌కు, మునుగోడు ఏడీఏ ఎల్లయ్య.. సూర్యాపేట జిల్లా కోదాడకు, మిర్యాలగూడ ఏడీఏ నాగమణి.. మిర్యాలగూడ భూసార పరీక్షా కేంద్రానికి, మిర్యాలగూడకు భువనగిరి నుంచి దేవ్‌సింగ్ బదిలీ అయ్యారు.

దరఖాస్తుల ఆహ్వానం

రామగిరి(నల్లగొండ) : ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ జి.రాంరెడ్డి డిస్టెన్స్ ఎడ్యుకేషన్ (పీజీఆర్ఆర్)లో వివిధ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు చేసుకోవాలని ఎన్జీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్, స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ వెల్దండి శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ, పీజీ, ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో చేరవచ్చునని తెలిపారు. www.oucde.net.com వెబ్‌సైట్ ద్వారా అక్టోబర్ 15వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న తర్వాత ఎన్జీ కళాశాలలోని ప్రొఫెసర్ జి రాంరెడ్డి డిస్టెన్స్ ఎడ్యుకేషన్ ఆఫీస్‌లో సర్టిఫికెట్ వెరిఫికేషన్ కోసం ఒక సెట్ జిరాక్స్ పత్రాలు సమర్పించాలని తెలిపారు. పూర్తి వివరాలకు 9398673736, 9866977741 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఆసరా పింఛన్ల పంపిణీ

నల్లగొండ : ఈ నెల 21 నుంచి 28వ తేదీ వరకు జిల్లాలోని ఆయా పోస్టాఫీసలలో వృద్ధాప్య, వితంతు, వికలాంగుల, చేనేత, కల్లుగీత, ఒంటరి మహిళలకు ఆసరా పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పింఛనుదారులు పింఛన్ మొత్తాన్ని పొందాలని, పింఛన్‌తోపాటు చిల్లర రూ.16 అడిగి తీసుకోవాలని ఎవరైనా చిల్లర ఇవ్వనట్లయితే నేరుగా డీఆర్‌డీఏ కార్యాలయంలో ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు. మధ్య దళారులను నమ్మి మోసపోవద్దని నేరుగా పోస్టాఫీసలలో మాత్రమే పింఛను తీసుకోవాలని సూచించారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

- డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి

మునుగోడు : రైతుల ఆర్థికాభివృద్ధి కోసం పీఏసీఎస్‌లు అందిస్తున్న పంట రుణాలతో పాటు సబ్సిడీ రుణాలు పొంది ఆర్థికంగా అభివృద్ధి చెందాలని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి కోరారు. బుధవారం ఆయన మునుగోడులోని ప్రాథమిక సహకార సంఘం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ రైతులకు ఎకరాకు రూ.45 వేల చొప్పున పంట రుణాలు అందిస్తున్నామన్నారు. వాణిజ్య సబ్సిడీ రుణాలతో పాటు విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించేందుకు వెళ్లే రైతుల పిల్లలకు విద్యా రుణాలు కూడా ఇస్తున్నామని.. వీటి ద్వారా రైతు కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. సమావేశంలో సంఘం సీఈఓ సుఖేందర్, కాంగ్రెస్ నాయకులు పాల్వాయి జితేందర్‌రెడ్డి, సాగర్ల లింగస్వామి, ఎండీ అన్వర్, పర్వతాలు, యంపల్లి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీకి 'రాఖీ' ఆదాయం రూ.2.23 కోట్లు

నల్లగొండ రూరల్ : ఆర్టీసీకి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రాఖీ పండుగ ఆదాయం దండిగా సమకూరింది. ఉమ్మడి జిల్లా పరిధిలో ఏడు డిపోల పరిధిలో పండుగ రోజున రూ.2,23,20,224 ఆదాయం లభించింది. బస్సుల్లో 3,78,982 మంది ప్రయాణించారు. లక్ష మంది మహాలక్ష్మి పథకం కింద లబ్ధిపొందారు. సాధారణ ఆర్టీసీ బస్సుల్లో రోజూ 2.20 లక్షల మంది ప్రయాణిస్తుంటారు. రోజువారీగా రూ.1.42 కోట్ల ఆదాయం సమకూరుతుంది. కానీ రాఖీ పండుగ రోజున ఆదారం పెరిగింది.

దళారీ చెప్పిందే ధర!

దయనీయ స్థితిలో బత్తాయి రైతులు

- తోటల దగ్గర టన్ను కాయల ధర రూ.11వేల నుంచి రూ.18 వేలే
- పెట్టుబడులు కూడా వెళ్లవని ఆవేదన
- బత్తాయికి కనీస మద్దతు ధర ప్రకటించాలని రైతుల డిమాండ్



తోటలో తెంపిన బత్తాయి కాయలను లోడ్ చేస్తున్న కూలీలు



నాగార్జునసాగర్, గుర్రంపోడు : బత్తాయి రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. తోటల సాగుకు రోజురోజుకూ పెట్టుబడులు పెరుగుతున్నా.. దానికి తగ్గట్లుగా బత్తాయి ధరలు పెగడం లేదు. ప్రస్తుత సీజన్‌లో టన్ను కాయలకు తోట వద్ద దళారులు పెట్టే ధర రూ.11వేల నుంచి రూ.18 వేలు దాటడం లేదు. వారు చెప్పిన రేటు విక్రయించకుండా ఉంచుకున్న రైతుల తోటల్లో నిత్యం క్వింటాళ్ల కొద్దీ కాయలు రాలిపోతున్నాయి. దీంతో తోటల దగ్గరకు వెళ్లి రైతులు కనీళ్లు పెట్టుకోవాల్సిన పరిస్థితి దాపురించింది. ఈ ఏడాది కత్తెర పంటకు కూడా ధర పలుకలేదు. కేవలం మే నెలలో నాలుగైదు రోజులు మాత్రమే తోటల దగ్గర నాణ్యమైన కాయలకు వ్యాపారులు రూ.40 వేలు ధర పెట్టారు. తర్వాత టన్ను ధర రూ.25 వేల నుంచి రూ.29 వేలే పలికింది. ఇక, ఈ సీజన్‌లో నెల రోజులుగా హైదరాబాద్‌లోని బాటసింగారం పండ్ల మార్కెట్‌లో నాణ్యమైన బత్తాయి కాయలు టన్ను ధర రూ.18 వేల నుంచి రూ.24 వేలు దాటలేదు. ఆ ధరకు అమ్మకపోతే మరుసటి రోజు వరకు మార్కెట్‌లో ఉండాల్సిందే. వరి, పత్తి, కంది, వేరుశనగ, మిరప లాంటి పంటల మాదిరిగానే బత్తాయికి కూడా ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించకుంటే రైతులకు ఆత్మహత్యలే శరణ్యం కానున్నాయి.

కరోనా తర్వాత పడిపోయన ధర

జిల్లాలో ప్రస్తుతం 43 వేల ఎకరాల్లో బత్తాయి తోటలు ఉన్నాయి. ఏడాది నుంచి ఐదేళ్ల లోపు మొక్కలు లక్ష ఎకరాల్లో ఉన్నాయి. 10వ సంవత్సరం నుంచి 16వ సంవత్సరం వరకు తగిన పెట్టుబడి పెడితే మంచి దిగుబడి వస్తుంది. కత్తెర సీజన్ (ఏప్రిల్ చివరి వారం నుంచి జూన్ మొదటి వారం)లో ఐదు శాతం పంట చేతికొస్తుంది. సీజన్ పంట (జూలై నుంచి సెప్టెంబర్)లో 95 శాతం దిగుబడి వస్తుంది. కత్తెర పంట కేవలం వాతావరణం, ఆయా ప్రాంతాల భూములపై ఆధారపడి ఉంటుంది. 2018లో కత్తెర బత్తాయికి టన్ను రూ.40 వేల నుంచి రూ.60 వేల వరకు ధర పలికింది. సీజన్ పంటకు కేవలం రూ.20 వేలు మాత్రమే వచ్చింది. 2019లో కరోనాతో పూర్తిగా ధర పడిపోయింది. టన్ను ధర రూ.9వేల నుంచి రూ.11వేల వరకు పలికింది. ఆనాటి నుంచి కత్తెర టన్ను ధర రూ.40 వేలకు, సీజన్ ధర రూ.20 వేలకు మించలేదు. ఇక ఈ ఏడాది కత్తెర, సీజన్ రెండు పంటల్లో కూడా సరైన ధర లభించలేదు. మహారాష్ట్రలో ముందుగా కురిసిన వర్షాలకు అక్కడి బత్తాయి కాయలు ఒకే సారి మార్కెట్‌కు రావడం, బత్తాయికి ప్రధాన మార్కెట్ ఢిల్లీలో ఇటీవలి కాలంలో కురుస్తున్న వర్షాలకు ధర పెరగకపోవడానికి కారణంగా వ్యాపారులు చెబుతున్నారు.

రూ.11వేలకే విక్రయించాను



బత్తాయిలను టన్ను రూ.11 వేలకే విక్రయించాను. వ్యాపారులు తోటల దగ్గరకు వచ్చి కాయను బట్టీ రేటు పెడుతున్నారు. తీరా కాయలు కోశాక పెట్టిన ధర రాలేదని తగ్గించుకోమని నగదు ఇవ్వకుండా మొండి కేసి పంచాయితీ పెడుతున్నారు. బత్తాయి పంటకు ధరలు ఇలాగే ఉంటే తోటలను తొలగించుకోవాల్సిందే.

– కర్నాటి వెంకట్‌రెడ్డి, బత్తాయి రైతు

రైతులు అప్పులపాలవుతారు



బత్తాయి పంటకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మద్దతు ధర కల్పించకుంటే రైతులు అప్పుల పాలవుతారు. ఇప్పటికే చాలామంది పండ్ల తోటల రైతులు అప్పుల్లో కూరుకపోయి నాలుగైదేళ్లకు ఎకరం చొప్పున మ్మి అప్పులు తీర్చుతున్నారు. బత్తాయి ధరలు ఇదేరీతిలో ఉంటే రైతులు పండ్ల తోటలు సాగుచేయలేరు.

– కుసిరెడ్డి నాగిరెడ్డి, రైతుసంఘం నేత

తనిఖీలు.. సస్పెన్షన్లు

- కొప్పోలులో కలెక్టర్ ఆకస్మిక పర్యటన
- లైవ్ స్టాక్ అసిస్టెంట్ సస్పెన్షన్
- ఎరువుల దుకాణాలపై రైతుల ఫిర్యాదు



కొప్పోలులో పర్యటిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

గుర్రంపోడు : మండలంలోని కొప్పోలు గ్రామంలో బుధవారం పలు ప్రభుత్వ సంస్థలను కలెక్టర్ నారాయణరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామంలోని పశువైద్య కేంద్రానికి తాళం వేసి ఉండడం, విధులకు సక్రమంగా హాజరుకావడం లేదని, పశు వైద్య చికిత్సలు అందించడం లేదని గ్రామ రైతులు ఫిర్యాదు చేయడంతో గ్రామ పశువైద్య కేంద్రం లైవ్ స్టాక్ అసిస్టెంట్ మట్టయ్యను సస్పెండ్ చేశారు. ముందుగా గ్రామంలోని వైద్య ఆరోగ్య ఉపకేంద్రాన్ని తనిఖీ చేసి సిబ్బంది హాజరు, మందుల స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ ఫీవర్ సర్వే ఎలా నడుస్తుందని, గ్రామంలో ఎంత మందికి జ్వరాలు వచ్చాయని అంగన్‌వాడీ టీచర్‌ను ప్రశ్నించారు. గ్రామంలో తిరుగుతూ స్వచ్ఛదనం-పచ్చదనం కింద చేపట్టిన పారిశుద్ధ్య కార్యక్రమాలను పరిశీలించారు. పిచ్చిమొక్కలు తొలగించాలని, డ్రెయినేజీలు పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. వంటగది, మధ్యాహ్న భోజనం, అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పరిశీలించారు. పాఠశాలలకు బియ్యం సరఫరాలో ఆలస్యం జరుగుతుందని హెచ్‌ఎం ఎస్.యాదగిరి కలెక్టర్ దృష్టికి తెచ్చారు.

ఎరువుల దుకాణాల లైసెన్స్‌లు రద్దు..

గ్రామంలో ఎరువుల దుకాణాల డీలర్లు అధిక ధరలకు ఎరువులను విక్రయిస్తున్నారని గ్రామ రైతులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో శివశంకర్ ఫర్టిలైజర్ ఏజెన్సీస్, జ్యోతి ఫర్టిలైజర్ దుకాణాల లైసెన్సులను కలెక్టర్ ఆదేశాలతో జిల్లా వ్యవసాయాధికారి రద్దు చేసినట్లు మండల వ్యవసాయాధికారి కె.మాధవరెడ్డి తెలిపారు.

శాండ్ ట్యాక్స్ ద్వారానే బుక్ చేసుకోవాలి

నల్లగొండ : ఇసుక అవసరమైన వారు శాండ్ ట్యాక్స్ ద్వారా బుక్ చేసుకోవాలని కలెక్టర్ నారాయణరెడ్డి సూచించారు. బుధవారం ఆయన నల్లగొండ నుంచి గుర్రంపోడు వెళ్తూ మార్గమధ్యలో మావిళ్లగూడెం, పర్వతగిరి గ్రామాల మధ్య వెళ్తున్న ఇసుక ట్రాక్టర్లను ఆపి అనుమతులు, లైసెన్స్, తదితర రశీదులను తనిఖీ చేశారు. ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



ఇసుక తీసుకెళ్లే వారి నుంచి శాండ్ ట్యాక్స్ రశీదులను పరిశీలిస్తున్న కలెక్టర్

తుంగతుర్తి అభివృద్ధికి కృషి చేస్తా



త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డిని సన్మానిస్తున్న సంకినేని వెంకటేశ్వర్‌రావు, బీజేపీ నాయకులు

- త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి
- తుంగతుర్తిలో ఆత్మీయ సమ్మేళనానికి హాజరు

తుంగతుర్తి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో మాట్లాడి తుంగతుర్తి ప్రాంత అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి చెప్పారు. త్రిపుర రాష్ట్ర గవర్నర్‌గా ఎన్నికైన తర్వాత తొలిసారిగా బుధవారం తుంగతుర్తికి వచ్చిన ఆయనకు బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని మాట్లాడారు. తుంగతుర్తి ప్రాంత బిడ్డగా, త్రిపుర ప్రజలకు గవర్నర్‌గా సేవచేసే భాగ్యం కల్పించినందుకు ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సమన్వయ కర్తగా ఉంటూ రాష్ట్రాల అభివృద్ధికి కృషి చేస్తున్నానని తెలిపారు. త్రిపుర గవర్నర్‌కు జిల్లా అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావు, డీఎస్పీ రవి, సీఐ శ్రీను, తహసీల్దార్ కంఠమయ్యలు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే సంకినేని వెంకటేశ్వర్‌రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కడియం రామచంద్రయ్య, జిల్లా అధ్యక్షుడు బొబ్బ భాగ్యరెడ్డి, సంకినేని రవీందర్‌రావు, సంకినేని వరుణ్‌రావు, మల్లేపాక సాయిబాబు, కాప రవికుమార్, కర్నాటి కిషన్, జుట్టుకొండ సత్యనారాయణ, సలిగంటి వీరేంద్ర, పల్స మల్సూర్‌గౌడ్ పాల్గొన్నారు.



గ్రామస్తులను ఆప్యాయంగా పలకరిస్తున్న త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి

నేను గవర్నర్ అయినా మీవాడినే..

'నేను గవర్నర్ అయినా మీవాడినే.. ఎప్పటిలాగే ఆదరించాలి' అని త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి అన్నారు. బుధవారం సాయంత్రం తన సొంతూరు తుంగతుర్తి మండలం గానుగుబండకు వెళ్లారు. గ్రామస్తులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. స్థానికులను ఆప్యాయంగా పలకరించి మాట్లాడారు. తాను ఈ గ్రామంలోనే పుట్టి ఆరో తరగతికి వరకు ఇక్కడే చదువుకున్నానని తెలిపారు. మూడు సార్లు మలక్‌పేట ఎమ్మెల్యేగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ బీజేపీ అధ్యక్షుడిగా పనిచేసినట్లు వివరించారు. గ్రామంలో ఉన్న ఇల్లును పాఠశాల కోసం ఇచ్చానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నల్లు రామచంద్రారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, ఇంద్రసేనారెడ్డి, ముత్తయ్య, వీరమల్లు, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళల భద్రతకే షీటీమ్స్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ క్రైం : మహిళల భద్రత కోసం షీటీమ్ పోలీస్ బృందాలు నిరంతరం పనిచేస్తాయని ఎస్పీ శరత్‌చంద్రపవార్ అన్నారు. బుధవారం ఎస్పీ కార్యాలయంలో షీటీమ్స్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఆకతాయిల ఆటకట్టించేందుకు రద్దీ ప్రదేశంలో షీటీమ్ పోలీస్ బృందాలు నిఘా ఉంచుతాయన్నారు. మహిళలు ఏదైనా ఇబ్బందులకు గురైతే డయల్ 100కు ఫోన్ చేయాలన్నారు. ఎలాంటి సమస్య ఉన్న నేరుగా పోలీస్‌స్టేషన్‌కు రాలేకపోతే షీటీమ్ నంబర్ (8712670235)కు ఫోన్ చేయాలన్నారు. క్యూఆర్ కోడ్‌స్కానింగ్ పద్ధతి, వాట్సప్ నంబర్ల ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చన్నారు. బాధితుల వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. గత నెలలో 14 ఫిర్యాదులు రాగా 43 అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని 18 మందికి కౌన్సిలింగ్ ఇచ్చామని తెలిపారు.

'పంచాయతీ' ఓటరు జాబితా షెడ్యూల్ విడుదల

- సెప్టెంబర్ 21న తుది జాబితా ప్రచురణ

నల్లగొండ : గ్రామ పంచాయతీల్లో ఓటరు జాబితా తయారీ, ప్రచురణకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. గ్రామాల్లో వార్డుల వారీగా ఓటర్ల జాబితాను సిద్ధం చేసి ప్రచురించనుంది. డ్రాఫ్టు ఫొటో ఓటర్ల జాబితాను గ్రామ పంచాయతీలు, వార్డు, డివిజన్ల వారీగా, మండల పరిషత్ కార్యాలయాల్లో సెప్టెంబర్ 6వ తేదీన ప్రచురించాలి. అదే నెల 9వ తేదీన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం, 10వ తేదీన మండలస్థాయిలో ఓటర్ల జాబితాపై ఎంపీడీఓలతో సమావేశం నిర్వహించాలి. ముసాయిదా ఓటర్ల జాబితాపై సెప్టెంబర్ 13 వరకు అభ్యంతరాలను స్వీకరిస్తారు. అభ్యంతరాలను జిల్లా పంచాయతీ అధికారి పరిశీలించి వాటిని సెప్టెంబర్ 19న తొలగిస్తారు. 21వ తేదీన వార్డుల విభజన సూచిస్తూ పంచాయతీల్లో తుది ఓటరు జాబితాను ప్రచురించాలి.

రుణమాఫీపై నేడు బీఆర్‌ఎస్ ధర్నా

- మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



మాట్లాడుతున్న చిరుమర్తి లింగయ్య

నకిరేకల్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఎలాంటి షరుతులు లేకుండా రూ.2లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం నకిరేకల్‌లోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతుల ధర్నా నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య తెలిపారు. బుధవారం స్థానిక బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు రైతులను మభ్య పెట్టి నేడు అడ్డగోలుగా ఆంక్షలు పెడుతున్నారన్నారు. రైతులందరికి రుణమాఫీ అయ్యే వరకు బీఆర్‌ఎస్ పోరాటం చేస్తోందని తెలిపారు. సమావేశంలో నకిరేకల్ మున్సిపల్ మాజీ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ మాద ధనలక్ష్మి నగేష్, నాయకులు సోమ యాదగిరి, పెండెం సదానందం, పల్లె విజయ్, గుర్రం గణేష్, రాచకొండ వెంకన్నగౌడ్, బోయిళ్ల కిషోర్, చాగోని శంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య శ్రీ ఉద్యోగుల నిరసన

నల్లగొండ టౌన్ : న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ ఆరోగ్యశ్రీ ఉద్యోగులు విధులను నిర్వహిస్తూనే నల్లబ్యాడ్జిలతో బుధవారం నిరసన తెలిపారు. అవుట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దు చేసి జీఓ నంబర్ 60 ప్రకారం వేతనాలు ఇవ్వాలన్నారు. ప్రభుత్వం స్పందించి తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో గోవిందరెడ్డి, నరేష్‌కుమార్, నాగరాజు, కవిత, రాధ, శశికళ పాల్గొన్నారు.

ఫ్లైఓవర్ నిర్మాణానికి సన్నాహాలు

చిట్యాలలో మార్కింగ్ వేసిన అధికారులు

- వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు
- సర్వీస్ రోడ్లవెంట దుకాణాలు తొలగించాలని ఆదేశం
- పిల్లర్స్‌తో కూడిన బ్రిడ్జి నిర్మించాలని పట్టణవాసుల డిమాండ్



చిట్యాల పట్టణంలోని జాతీయ రహదారి



చిట్యాల మున్సిపల్ కార్యాలయం వద్ద వ్యాపారులు, దుకాణాదారులు

చిట్యాల : చిట్యాల పట్టణంలోని 65 నంబరు జాతీయ రహదారిపై ఫ్లై ఓవర్ బ్రిడ్జి పనులకు సన్నాహాలు మొదలయ్యాయి. పట్టణంలోని పాల శీతలీకరణ కేంద్రం సమీపంలో ప్రారంభమైన సర్వీస్ రోడ్డు నుంచి ఎస్‌బీఐ బ్యాంకు వరకు ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు జరగనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే సర్వీస్ రోడ్లకు ఇరువైపులా ఉన్న తాత్కాలిక నిర్మాణాలను తొలగించాలని దుకాణదారులకు సమాచారం ఇచ్చారు. జాతీయ రహదారి మధ్యలో నుంచి వంద అడుగుల దూరంలో గల దుకాణ సముదాయాలకు అధికారులు నాలుగు రోజుల క్రితం మార్కింగ్ చేశారు. మార్కింగ్ చేసినంత వరకు ఎలాంటి ఆటంకాలు లేకుండా ఉండాలని సూచించారు. నిర్మాణ పనులు ప్రారంభమైన వెంటనే విజయవాడ–హైదరాబాద్–భువనగిరి నుంచి వచ్చే వాహనాలు వెళ్లేందుకుగాను వీలుగా జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న సర్వీస్ రోడ్డుల నుంచి రాకపోకలకు అధికారులు ఏర్పాట్లు చేశారు. కాగా, పట్టణంలో ఫ్లైఓవర్ బ్రిడ్జి (మట్టికట్టతో కూడిన) నిర్మాణం కాకుండా పూర్తిస్థాయి పిల్లర్స్‌తో నిర్మించాలని కోరుతూ పట్టణవాసులు బుధవారం మున్సిపల్ చైర్మన్‌కు విన్నవించారు.

రూ.45 కోట్లతో నిర్మాణం

పట్టణంలో జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకుగాను ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపడుతున్నారు. దీని నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.45 కోట్లు మంజూరు చేసింది. ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులకు జూన్ 23వ తేదీన రాష్ట్ర రోడ్లు భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం శంకుస్థాపన చేశారు. పట్టణంలో సుమారుగా 750 నుంచి 800 మీటర్ల పొడవున ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణాన్ని చేపట్టనున్నారు. అంతే కాకుండా స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదురుగా గల జంక్షన్ వద్ద అండర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టి వాహనాల రాకపోకలకు వీలుగా నిర్మాణం జరగనుంది.

దుకాణాదారుల్లో ఆందోళన..

జాతీయ రహదారిపై ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణంతో సర్వీస్ రోడ్డులోని దుకాణ, వ్యాపారదారుల్లో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో జాతీయ రహదారి విస్తరణలో తీవ్రంగా ఆస్తి నష్టం జరిగిందని, ఇప్పుడు సర్వీస్ రోడ్డులో ఉన్న తమ దుకాణాలకు మెట్లు తొలగించాలని, సెట్ బ్యాగ్ కావాలంటూ అధికారులు ఆదేశాలిచ్చారని ఆందోళన చెందుతున్నారు. దీంతో బుధవారం పట్టణంలోని సర్వీస్ రోడ్లులోని దుకాణాదారులు చిట్యాల మున్సిపాలిటీ వద్దకు తమ సమస్యను చెప్పుకునేందుకు వచ్చారు. పట్టణంలో ఫ్లైఓవర్ బ్రిడ్జి (మట్టికట్టతో కూడిన) నిర్మాణం చేపట్టనుండటంతో పట్టణం రెండు ప్రాంతాలుగా వీడిపోతుండటంతో వ్యాపారాలకు తీవ్ర నష్టం జరుగుతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టితే వాహనాల రాకపోకలు ఎక్కువగా సర్వీస్ రోడ్డులోనే వస్తాయని.. దీని వల్ల రోడ్డు పక్కన గల టిఫిన్, మిర్చిల బండ్లు, కూరగాయాల, పండ్ల, పూలను అమ్మే చిరు వ్యాపారులకు జీవనం కష్టంగా మారటంతో పాటు ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతాయని వ్యాపారస్తులు పేర్కొంటున్నారు. ఫ్లైఓవర్ బ్రిడ్జి సాన్థంలో పూర్తిస్థాయిలో పిల్లర్లతో కూడిన బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డిని కలిసి తమ సమస్యలను వివరించారు. దీనిపై మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ వ్యాపారస్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

పిల్లర్స్‌తో కూడిన బ్రిడ్జి నిర్మించాలి



జాతీయ రహదారి విస్తరణతో చిట్యాల పట్టణంలో ఎంతో మందికి ఆస్తి నష్టం వాట్టిల్లింది. ఇప్పుడు మళ్లీ చేపట్టిన ఫ్లైఓవర్ బ్రిడ్జిని పూర్తిస్థాయిలో పిల్లర్స్‌తో నిర్మించాలి. ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మిస్తే సర్వీస్ రోడ్డులోని తమ వ్యాపారాలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయి. ఇందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరించాలి.

– సాల్వేరు బాలరాజు, చిట్యాల

క్లుప్తంగా

ఆలయంలో చోరీ

త్రిపురారం: మండలంలోని పెద్దదేవులపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని నర్లకంటిగూడెంలో గల కోదండరామాలయంలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు బుధవారం గ్రామస్తులు గుర్తించారు. ఆలయంలోని సీతారాముల విగ్రహాలపై ఉన్న బంగారు, వెండి నగలు, హుండీలోని నగదు, భక్తులు మొక్కులు చెల్లించుకున్న వస్తువులు దోచికెళ్లినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. పోలీసులు స్పందించి గ్రామంలో రాత్రివేళ పెట్రోలింగ్ నిర్వహించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


శేఖర్ (ఫైల్)

రామన్నపేట: రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. రామన్నపేట మండలం ఇంద్రపాలనగరం గ్రామానికి చెందిన తెడ్డు శేఖర్(56) ఈ నెల 19వ తేదీన టీవీఎస్ ఎక్సెల్‌పై నిధానపల్లి శివారులోని పొలం వద్దకు వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా చిట్యాల వైపు వెళ్తున్న రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శేఖర్‌తో పాటు రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌పై వెళ్తున్న వ్యక్తికి కూడా గాయాలయ్యాయి. ఇరువురిని స్థానికులు ఆస్పత్రికి తీసుకెళ్లారు. తీవ్రంగా గాయపడిన తెడ్డు శేఖర్ నార్కట్‌పల్లిలోని కామినేని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. మృతుడి భార్య కవిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పి. మల్లయ్య తెలిపారు.

దేవరకొండలో నార్కోటిక్స్ అధికారుల దాడులు

దేవరకొండ: దేవరకొండలో ఎన్‌సీబీ(నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో)అధికారులు బుధవారం ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. ఆర్టీసీ కార్గోలో హైదరాబాద్ నుంచి అనుమానాస్పద పేస్ట్ రవాణా అవుతున్నట్లు విశ్వసనీయ సమాచారం అందడంతో హైదరాబాద్ నుంచి వచ్చిన ఎన్‌సీబీ అధికారులు స్థానిక ఎక్సైజ్ అధికారులతో కలిసి దాడులు నిర్వహించారు. ఆర్టీసీ కార్గో పార్సిల్స్ వద్ద 15ప్యాకెట్లలో గల వైట్ పేస్ట్‌ను స్వాధీనం చేసుకున్నారు. పార్సిల్ ఎవరి పేరు మీద వచ్చింది అన్న సమాచారం మేరకు వివరాలు సేకరించి సదరు వ్యక్తిని విచారిస్తున్నట్లు దేవరకొండ ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. పార్సిల్‌లో వచ్చిన పేస్ట్‌ను హైదరాబాద్‌లో గల ల్యాబ్‌కు పంపినట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి పూర్తివివరాలు తెలియాల్సి ఉందన్నారు.

13 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

నకిరేకల్: అక్రమంగా తరలిస్తున్న 13 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని నకిరేకల్ శివారులో బుధవారం పోలీసులు పట్టుకున్నారు. భువనగిరి మండలం పుచ్చర్లతండాకు చెందిన కునుసోతు బలరాం తన ఆటోలో ఊరూరా తిరుగుతూ అల్లం, ఎల్లిగడ్డ అమ్ముకునేవాడు. తిప్పర్తి మండలం పెద్దసూరారం నుంచి బుధవారం సాయంత్రం తన ఆటోలో 13 క్వింటాళ్ల రేషన్ బియ్యం తీసుకుని భువనగిరికి వెళ్తుండగా.. మార్గమధ్యలో నకిరేకల్ శివారులోని తాటికల్ ఫ్లైఓవర్ వద్ద ఎస్ఐ లచ్చిరెడ్డి, పోలీస్ సిబ్బంది వాహనాలు తనిఖీ చేస్తూ ఆటోను పట్టుకున్నారు. 13 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకుని సివిల్ సప్లై అధికారులకు అప్పగించారు. బలరాంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

చిన్నకాపర్తిలో 50 బ్యాగులు..

చిట్యాల: మండలంలోని చిన్నకాపర్తి గ్రామం నుంచి బొమ్మలరామారం మండలం కల్వకుంట్లతండాకు చెందిన లావుడి సురేష్ బుధవారం యాభై బ్యాగుల(ఒక్కోటి 50 కేజీలు) రేషన్ బియ్యాన్ని అశోక్ లేలాండ్ వాహనంలో తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్ఐ ఎన్. ధర్మా తెలిపారు. వాహనంతో పాటు రేషన్ బియ్యాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

రామేశ్వర గుట్టపై త్రికూటాలయం ఆనవాళ్లు


త్రికూటాలయం ఆనవాళ్లను పరిశీలిస్తున్న పురావస్తు పరిశోధకుడు శివనాగిరెడ్డి తదితరులు

డిండి: మండల పరిధిలోని రహమంతాపూర్ గ్రామ శివారులో గల రామేశ్వర గుట్టపై క్రీ.పూ.1000 సంవత్సరాల నాటి కాకతీయ కాలపు త్రికూటాలయం ఆనవాళ్లు ఉన్నట్లు పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా సీఈఓ డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి బుధవారం తెలిపారు. రహమంతాపూర్ గ్రామానికి చెందిన ఎలిమినేటి వెంకట్ ద్రావిడ్ ఇచ్చిన సమాచారం మేరకు రామేశ్వరం గుట్టపై ఈ నెల 16న జరిపిన అన్వేషణలో కాకతీయ కాలపు త్రికూటాలయం కుడి వైపు గదులను పోలిన డాల్మెన్ అనే ఇనుపయుగపు సమాధుల ఆనవాళ్లు ఉన్నాయని, గ్రామస్తులు జరిపిన క్వారీ పనుల్లో కొన్ని ధ్వంసం కాగా మిగిలిన ఒకే ఒక్క కట్టడం ప్రమాదపుటంచున ఉందని ఆయన తెలిపారు. గుట్టపై 5 అడుగుల ఎత్తు రాళ్ల వరుసపై 25 అడుగుల పొడవు, 18 అడుగుల వెడల్పు, అడుగున్నర మందం గల పెద్ద గ్రానైట్ రాతి పలకను ఒక వైపు ద్వారంతో అమర్చి ఉందని, అప్పుడే అందుబాటులోకి వచ్చిన ఇనుప పనిముట్లతో మరణించిన వారికి స్మారకంగా నిర్మించిన ఇనుప యుగం కట్టడం అప్పటి ప్రజల సామూహిక శ్రమకు, కట్టడ నైపుణ్యానికి, అలనాటి ఆచారానికి అద్దం పట్టేలా ఉందని స్థానికులకు ఆయన అవగాహన కల్పించారు. తెలంగాణ చరిత్రకు ఆధారాలైన 3వేల సంవత్సరం నాటి ఇనుప యుగపు కట్టడాలపై అవగాహన లేకనే అంతరించిపోతున్నాయని, ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఆనవాళ్లనైనా కాపాడుకుని భవిష్యత్ తరాలకు అందించేందుకు కృషి చేయాలని ఆయన గ్రామస్తులకు విజ్ఞప్తి చేసారు. అదేవిధంగా ఇదే స్థావరానికి దగ్గరలో నాగర్‌కర్నూల్ జిల్లా జూపల్లి గుట్టపై, కాకతీయ కాలానికి చెందిన డాల్మెన్లతో పాటు మెన్ హిర్లనే ఇనుపయుగపు నిలువు రాళ్ల ఆనవాళ్లు కోల్పోతున్నాయని తెలంగాణ చరిత్ర బృందం కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్ తనకు సమాచారం ఇచ్చారని శివనాగిరెడ్డి తెలిపారు. ఆయన వెంట తుంగళ్లపల్లి సత్యనారాయణచారి, అండేకోర్ నర్సోజీ ఉన్నారు.

అనుమతుల్లేకుండా ఆస్పత్రులు నిర్వహిస్తే చర్యలు తప్పవు

● సూర్యాపేట జిల్లా డిప్యూటీ డీఎంహెచ్ఓ నిరంజన్


డిప్యూటీ డీఎంహెచ్ఓ కారును అడ్డుకున్న మేళ్లచెరువు గ్రామస్తులు

మేళ్లచెరువు: అనుమతుల్లేకుండా ఆర్ఎంపీలు ఆస్పత్రులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సూర్యాపేట జిల్లా డిప్యూటీ డీఎంహెచ్ఓ నిరంజన్ తెలిపారు. మేళ్లచెరువు మండలం వెల్లటూరు గ్రామానికి చెందిన బాలుడు జ్వరంతో బాధపడుతుండగా మండల కేంద్రానికి చెందిన ఆర్ఎంపీ ఇంజెక్షన్ వేశాడు. జ్వరం తగ్గకపోవడంతో ఖమ్మంలోని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా బాలుడు మృతిచెందాడు. ఆర్ఎంపీ చేసిన ఇంజెక్షన్‌తోనే బాలుడికి జ్వరం ఎక్కువై మృతిచెందాడని ఫిర్యాదు అందడంతో బుధవారం ఆర్ఎంపీ నిర్వహిస్తున్న ఆస్పత్రిని సీజ్ చేసినట్లు డిప్యూటీ డీఎంహెచ్ఓ తెలిపారు.

డిప్యూటీ డీఎంహెచ్ఓ కారు అడ్డగింత

ఆర్ఎంపీ నిర్వహిస్తున్న ఆస్పత్రిని సీజ్ చేయడాన్ని నిరసిస్తూ డిప్యూటీ డీఎంహెచ్ఓ నిరంజన్ కారును మేళ్లచెరువు గ్రామస్తులు అడ్డుకున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులు అందుబాటులో ఉండరని, మందులు కూడా సరిగ్గా దొరక్కపోవడంతో తాము ఆర్ఎంపీలతో వైద్యం చేయించుకుంటుంటే ఆస్పత్రిని సీజ్ చేయొద్దని కారును అడ్డుకున్నారు. దీంతో డిప్యూటీ డీఎంహెచ్ఓ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు వచ్చి డీఎంహెచ్ఓను పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న గ్రామస్తులు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్, వైద్య సిబ్బందిపై ఆరోపణలు చేశారు. ప్రభుత్వం డాక్టర్లు వైద్యం సక్రమంగా అందిస్తే ఆర్ఎంపీల వద్దకు ఎందుకు వెళ్తామని ఆగ్రహం వ్యక్తం చేశారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

పెద్దఅడిశర్లపల్లి: బత్తాయి తోటలో చెట్లు కత్తిరిస్తుండగా.. ఆ చెట్ల మధ్యలో నుంచి వెళ్లిన సర్వీస్ వైరుకు కత్తెర తాకి విద్యుదాఘాతానికి గురై వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన పెద్దఅడిశర్లపల్లి మండలం రాంపురం గ్రామంలో బుధవారం జరిగింది. గుడిపల్లి ఎస్ఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దవూర మండలం ఉట్లపల్లి గ్రామానికి చెందిన ఊరడి మల్లయ్య (32) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం అతడు గ్రామస్తులతో కలిసి పెద్దఅడిశర్లపల్లి మండలం రాంపురం గ్రామానికి చెందిన ముత్యాల మల్లయ్య బత్తాయి తోటలో చెట్లు కత్తిరించేందుకు వెళ్లాడు. చెట్ల మధ్యలో నుంచి సర్వీస్ వైరు వెళ్లగా.. దానిని గమనించకుండా మల్లయ్య కత్తెరతో చెట్టు కత్తిరిస్తుండగా విద్యుదాఘాతానికి గురై కిందపడిపోయాడు. తోటి కూలీలు 108 సిబ్బందికి సమాచారం ఇవ్వగా.. వారు వచ్చి పరీక్షించగా అప్పటికే మృతిచెందాడు. మృతుడి భార్య జ్యోతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ప్రస్తుతం అతడి భార్య గర్భవతి అని గ్రామస్తులు తెలిపారు.

హెడ్‌కానిస్టేబుల్ భార్య ఆత్మహత్య

భువనగిరి క్రైం: పట్టణంలోని రూరల్ పోలీస్ స్టేషన్ క్వార్టర్స్‌లో బుధవారం హెడ్‌కానిస్టేబుల్ భార్య ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. రామన్నపేట మండలం మునిపంపులకు చెందిన మొట్టు మధుసూదన్‌రెడ్డి భువనగిరి రూరల్ పోలీస్ స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అతడికి 12సంవత్సరాల క్రితం వివాహం జరగగా సంతానం కలుగలేదు. దీంతో మొదటి భార్య అంగీకారం మేరకు రామన్నపేట మండలం సిరిపేముల గ్రామానికి చెందిన విజయలక్ష్మి(36)ని రెండో వివాహం చేసుకున్నాడు. అయితే ఏడాది తేడాతో మొదటి భార్యకు కవల పిల్లలు, రెండో భార్యకు కుమార్తె జన్మించింది. అప్పటి నుంచి మొదటి భార్య పిల్లలతో కలిసి హైదరాబాద్‌లో ఉంటుండగా మధుసూదన్‌రెడ్డి రెండో భార్యతో కలిసి రూరల్ పోలీస్ స్టేషన్ క్వార్టర్స్‌లో ఉంటున్నాడు. ఆస్తి పంపకాలకు సంబంధించి కొంత కాలంగా మధుసూదన్‌రెడ్డి దంపతులు, బంధువుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. బుధవారం విధులకు వెళ్లిన మధుసూదన్‌రెడ్డి మధ్యాహ్నం భోజనం కోసం ఇంటికి రాగా విజయలక్ష్మి సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని కనిపించింది. మధుసూదన్‌రెడ్డి గట్టిగా అరవడంతో క్వార్టర్స్‌లో ఉన్న పోలీస్ కుటుంబాలతో పాటు పక్కనే ఉన్న రూరల్ పోలీస్ సిబ్బంది వచ్చి విజయలక్ష్మిని కిందికి దించగా అప్పటికే మృతిచెందింది. మృతురాలి కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్ఐ మల్లయ్య తెలిపారు.

అప్పుల బాధతో చేనేత కార్మికుడు మృతి


అంజయ్య (ఫైల్)

చండూరు: అప్పుల బాధతో చేనేత కార్మికుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. చండూరు పట్టణానికి చెందిన పులిపాటి అంజయ్య(67) చేనేత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నాడు. ఇటీవల చేనేత పనులు లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. దీంతో మద్యానికి బానిసగా మారాడు. మంగళవారం అర్ధరాత్రి భార్య నిద్రిస్తున్న సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. వారికి వివాహం చేశాడు.

తల్లి మందలించిందని యువకుడి బలవన్మరణం

● యాసిడ్ తాగి ఆత్మహత్య


హరికృష్ణ (ఫైల్)

డిండి: చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని తల్లి మందలించడంతో మనస్తాపానికి గురైన యువకుడు యాసిడ్ తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన డిండి మండల పరిధిలోని ప్రతాప్‌నగర్ గ్రామంలో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రతాప్‌నగర్ గ్రామానికి చెందిన తెల్కపల్లి రాములు, వరమ్మ దంపతులకు కుమారుడు హరికృష్ణ(25) సంతానం. హరికృష్ణ చిన్నతనంలోనే తండ్రి రాములు అనారోగ్యంతో మృతిచెందాడు. అప్పటి నుంచి తల్లివరమ్మ కూలీ పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. గత మూడేళ్లుగా లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్న హరికృష్ణ 6 నెలల నుంచి ప్రతాప్‌నగర్‌లోనే ఉంటున్నాడు. ఈ క్రమంలో కొన్నిరోజుల నుంచి మద్యానికి బానిసైన హరికృష్ణ ఖర్చుల నిమిత్తం కొంత డబ్బు కావాలని మంగళవారం తల్లి వరమ్మను అడిగాడు. ఈ క్రమంలోనే తల్లీకొడుకుల మధ్య వాగ్వాదం జరిగింది. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని తల్లి హరికృష్ణను మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన హరికృష్ణ ఇంట్లో ఎవరూ లేని సమయంలో బాత్‌రూంలో ఉన్న యాసిడ్ తాగి స్పృహతప్పి పడిపోయాడు. చుట్టుపక్కల వారు గమనించి వరమ్మకు సమాచారం ఇచ్చారు. కుటుంబ సభ్యులు హరికృష్ణను చికిత్స నిమిత్తం దేవరకొండకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌కు తరలిరచగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పజెప్పారు. మృతుడి బంధువు పులి తిరుపతయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజు తెలిపారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

● ముగ్గురి అరెస్ట్

హుజూర్‌నగర్: వ్యభిచార గృహంపై పోలీసులు దాడి చేసి ఇద్దరు విటులను, నిర్వాహకురాలిని అరెస్ట్ చేశారు. ఎస్ఐ ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్ పట్టణంలోని ఎంపీపీ కాలనీలో ఓ ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు బుధవారం పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు సాయంత్రం సమయంలో వ్యభిచార గృహంపై దాడి చేసి ఇద్దరు విటులను, నిర్వాహకురాలి అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి ఐదు సెల్ ఫోన్లు, 3 మోటారు సైకిళ్లు, రూ.1700 స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

సూర్యాపేటటౌన్: మద్యానికి బానిసైన వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడకు చెందిన ఎండీ ఖుర్షీద్(50) సూర్యాపేట పట్టణంలోని చర్చి కాంపౌండ్‌లో తన అల్లుడైన ఎండీ అస్రార్ అలీ వద్ద ఉంటూ నేషనల్ చికెన్ సెంటర్‌లో పనిచేస్తున్నాడు. ఖుర్షీద్ గతేడాది నుంచి తాగుడికి బానిసై తిరుగుతున్నాడు. గత రెండు రోజులుగా అతడు కనిపించడం లేదు. ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. అతడి బంధువులకు బుధవారం వాట్సాప్ గ్రూపుల్లో సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో గుర్తుతెలియని మృతదేహం ఉన్నట్లు తెలియడంతో అక్కడికి వెళ్లి చూడగా అది ఖుర్షీద్ మృతదేహంగా గుర్తించారు. మృతుడి అన్న కుమారుడు బాసిద్‌బాబా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ రాజశేఖర్ తెలిపారు.

ముగ్గురిని గాయపర్చిన కుక్క

చందంపేట: నేరెడుగొమ్ము మండలం పలుగుతండా గ్రామంలో బుధవారం పిచ్చికుక్క దాడి చేసి ముగ్గురిని గాయపర్చింది. గ్రామానికి చెందిన సూర మంచంపై నిద్రిస్తుండగా అతడిపై పిచ్చికుక్క దాడి చేసి గాయపర్చింది. అదేవిధంగా ఆరేళ్ల వయస్సున్న నేనావత్ అక్షిత, 15 ఏళ్ల బాలుడు కార్తీక్‌పై కూడా దాడి చేసి కరిచింది. వారిని చికిత్స నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు హైదరాబాద్‌కు తీసుకెళ్లారు.

కుక్కల దాడిలో 30 గొర్రెలు మృతి


మృతిచెందిన గొర్రెలు

యాదగిరిగుట్ట రూరల్: గొర్రెల మందపై కుక్కల దాడి చేయడంతో 30 గొర్రెలు మృతిచెందాయి. ఈ ఘటన యాదగిరిగుట్ట మండలం కాచారం గ్రామ శివారులో బుధవారం ఉదయం జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆలేరు పట్టణానికి చెందిన ఎగ్గిడి సంపత్ యాదగిరిగుట్ట మండలం కాచారం గ్రామ శివారులో భూమిని కౌలుకు తీసుకుని గొర్రెలను మేపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం గొర్రెల మందను మేతకు తీసుకెళ్లి యథావిధిగా సాయంత్రం పాకలోకి తోలి ఇంటికి వెళ్లిపోయాడు. బుధవారం ఉదయం వచ్చి చూడగా 30 గొర్రెలు మృతిచెంది ఉండటం గమనించాడు. కుక్కలు దాడి చేయడంతో గొర్రెలు చనిపోయినట్లు బాధితుడు తెలిపాడు. ప్రభుత్వం తనకు నష్టపరిహారం అందజేయాలని కోరుతున్నాడు.

సీఎంఆర్‌ను త్వరగా పూర్తిచేయాలి

నల్లగొండ: రైస్ మిల్లర్లు కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్)ను త్వరగా పూర్తిచేయాలని నల్లగొండ జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ ఆదేశించారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో రైస్ మిల్లర్లతో వానాకాలం, గత యాసంగి సీఎంఆర్‌పై సమీక్ష సమావేశం నిర్వహించారు. గత వానాకాలానికి సంబంధించి 71శాతం సీఎంఆర్ పూర్తి చేశామని, మిగతా 29శాతాన్ని రైస్ మిల్లర్లు రోజువారి నిర్దేశించిన ప్రకారం సెప్టెంబర్‌లోగా పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. యాసంగికి 54శాతం సీఎంఆర్ పూర్తికాగా మిగతావి డెలివరీ చేయడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, మొత్తానికి రెండు సీజన్లకు సంబంధించిన సీఎంఆర్‌ను సెప్టెంబర్‌లోగా పూర్తి చేయాలని మిల్లర్లకు సూచించారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల మేనేజర్ నాగేశ్వరరావు, డీఎస్ఓ వెంకటేశ్వర్లు, ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నల్లగొండ అదనపు కలెక్టర్ శ్రీనివాస్

జాతీయ వేడుకలకు సతీష్ మహిళా డప్పు కళా బృందం

గరిడేపల్లి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విశాఖపట్నంలో నిర్వహిస్తున్న జాతీయ జానపద దినోత్సవం వేడుకల్లో పాల్గొనేందుకు గరిడేపల్లి మండలం అప్పన్నపేట గ్రామానికి చెందిన సతీష్ మహిళా డప్పు కళా బృందం బుధవారం బయల్దేరి వెళ్లారు. తమ మహిళా డప్పు కళా బృందానికి అవకాశం కల్పించిన తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, అందె మ్యూజిక్ అకాడమీ డైరెక్టర్ అందె భాస్కర్‌కి సతీష్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.


జాతీయ జానపద వేడుకలకు వెళ్తున్న సతీష్ మహిళా డప్పు కళాకారులు

ప్రత్యేక పాఠశాలల్లో గుణాత్మక విద్యనందించాలి


మాట్లాడుతున్న నల్లగొండ కలెక్టర్ నారాయణరెడ్డి, పక్కన అదనపు కలెక్టర్, డీఈఓ తదితరులు

● నల్లగొండ కలెక్టర్ నారాయణరెడ్డి

నల్లగొండ: నియోజకవర్గాల వారీగా ఎంపిక చేసిన ప్రత్యేక పాఠశాలల్లో గుణాత్మక విద్య అందించాలని నల్లగొండ కలెక్టర్ సి. నారాయణరెడ్డి అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం జిల్లా, మండల విద్యాశాఖ అధికారులు, హెడ్మాస్టర్లతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గుణాత్మక విద్య అందించడం ద్వారా ఈ సంవత్సరం పదో తరగతి ఫలితాల్లో కనీసం 50శాతం మంది విద్యార్థులు 10కి 10 జీపీఏ సాధించేలా చూడాలని ఆదేశించారు. ప్రైవేట్ పాఠశాలల మాదిరిగా ప్రభుతపాఠశాలల విద్యార్థులు కూడా ఐఐటీపై దృష్టి సారించేలా చూడాలన్నారు. వారంలోగా ప్రతి పాఠశాలలో ఒక సబ్జెక్ట్ టీచర్ తో 8, 9, 10 తరగతుల్లో డిజిటల్ ప్రోగ్రాం రూపొందించాలని అన్నారు. పాఠశాలల్లో కంప్యూటర్, సైన్స్ ల్యాబ్‌లు ఏర్పాటు చేయాలని, పెయింటింగ్ పనులు పూర్తి చేయాలన్నారు. మాడ్యులర్ కిచెన్‌తో సహా టాయిలెట్లను పూర్తిచేయాలని ఆదేశించారు. అవసరమైన పాఠశాలలకు ఇంగ్లిష్ టీచర్లతో పాటు కేరళ టీచర్లను ఏర్పాటు చేస్తామని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర, జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి, గృహనిర్మాణ శాఖ పీడీ రాజ్‌కుమార్, డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి, జిల్లా బీసీ సంక్షేమ అధికారి రమేష్, డీఈఓ భిక్షపతి పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న లారీ.. హెడ్‌కానిస్టేబుల్ దుర్మరణం


రాములు (ఫైల్)

వేములపల్లి: బైక్‌ను లారీ వేగంగా వచ్చి ఢీకొట్టడంతో బైక్‌పై వెళ్తున్న ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ మృతిచెందాడు. ఈ ఘటన వేములపల్లి మండలం శెట్టిపాలెం గ్రామ శివారులో భీమారం- సూర్యాపేట రహదారిపై బుధవారం జరిగింది. ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా తుంగతుర్తికి చెందిన జలగం రాములు(53) సూర్యాపేటలో ఏఆర్ హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తూ సూర్యాపేట పట్టణంలోని అలకాపురిరం కాలనీలో నివాసముంటున్నాడు. విధి నిర్వహణలో భాగంగా రాములు బుధవారం భీమారం-సూర్యాపేట రహదారి మీదుగా మిర్యాలగూడకు తన బైక్‌పై వస్తుండగా.. వేములపల్లి మండలం శెట్టిపాలెం గ్రామ శివారుకు చేరుకోగానే మిర్యాలగూడ వైపు నుంచి రాంగ్ రూట్‌లో వస్తున్న లారీ బైక్‌ను ఢీకొట్టింది. రాములు లారీ వెనుక చక్రాల కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. శరీరం మొత్తం ఛిద్రమైంది. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించగా.. ఘటనా స్థలానికి చేరుకున్న మృతదేహానికి పంచనామా నిర్వహించి మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య నాగమణి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

డివైడర్‌ను ఢీకొని ద్విచక్ర వాహనదారుడు మృతి

● మరొకరికి తీవ్రగాయాలు

నకిరేకల్: బైక్‌పై వెళ్తున్న యువకులు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ఒకరు మృతిచెందగా.. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన నకిరేకల్ శివారులో విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీకాకుళం జిల్లా సావరకోట మండలం కుమ్మరికుంటకు చెందిన సాదు సంతోష్(24), అతడి స్నేహితుడు సారత్ హైదరాబాద్‌లో సినిమా ఇండస్ట్రీలో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నారు. వీరు తమ స్వగ్రామం నుంచి హైదరాబాద్‌కు రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌పై బుధవారం తెల్లవారుజామున బయల్దేరారు. సంతోష్ బైక్ నడుపుతుండగా.. సారత్ వెనుక కూర్చున్నాడు. మార్గమధ్యలో నకిరేకల్ శివారులోని హరిక్రిష్ణ పారాబాయిల్డ్ మిల్లు సమీపంలోకి రాగానే అతివేగంతో విజయవాడ-హైదరాబాద్ హైవే మధ్యలో డివైడర్‌ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో సంతోష్ అక్కడికక్కడే మృతిచెందాడు. సారత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సారత్‌ను చికిత్స నిమిత్తం నార్కట్‌పల్లిలోని కామినేని ఆస్పత్రికి తరలించారు. సారత్ తెలిపిన వివరాల మేరకు సంతోష్ కుటుంబ సభ్యులకు పోలీసులు సమాచారం అందించారు. హైదరాబాద్‌లో ఉంటున్న సంతోష్ సోదరి బోరువెల్లి లలిత నకిరేకల్‌కు చేరుకుంది. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు నకిరేకల్ సీఐ రాజశేఖర్ తెలిపారు.

గంజాయి తాగుతున్న యువకులపై కేసు నమోదు


భూదాన్‌పోచంపల్లి: పోలీసులు అదుపులో గంజాయి తాగుతున్న యువకులు

భూదాన్‌పోచంపల్లి: గంజాయి తాగుతున్న ముగ్గురు యువకులపై కేసు నమోదు చేసినట్లు పోచంపల్లి ఎస్ఐ భాస్కర్‌రెడ్డి బుధవారం తెలిపారు. పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ముక్తాపూర్ గ్రామానికి చెందిన రమావత్ భానుప్రకాశ్, ముద్దం బాలమల్లేశ్, గోదాసు రాజు గ్రామ శివారులో గంజాయి తాగుతున్నట్లు సమాచారం అందడంతో వారిని అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. వారి వద్ద నుంచి సుమారు 110 గ్రాముల గంజాయితో పాటు బైక్, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని సీజ్ చేశామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గంజాయి విక్రయించేందుకు వస్తూ పట్టుబడిన యువకులు..?

కోదాడరూరల్: గంజాయి రవాణా చేస్తున్న ఐదుగురు యువకులను కోదాడ రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ కృష్ణా జిల్లా జగ్గయ్యపేట నుంచి గంజాయి విక్రయించేందుకు వస్తున్న యువకులను కోదాడ మండలం రెడ్లకుంట శివారులో పోలీసులు పట్టుకున్నట్లు తెలిసింది. పూర్తి వివరాలు గురువారం వెల్లడిస్తామని కోదాడ రూరల్ పోలీసులు తెలిపారు.

కుటుంబ తగాదాలతో ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య


వేణుకుమార్ (ఫైల్)

భువనగిరి క్రైం: కుటుంబ తగాదాలతో మనస్తాపానికి గురైన వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన భువనగిరి పట్టణంలోని విద్యానగర్‌లో బుధవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విద్యానగర్‌కు చెందిన గంగదేవి వేణుకుమార్‌రెడ్డి(42), స్రవంతి 12ఏళ్ల క్రితం కులాంతర ప్రేమ వివాహం చేసుకున్నారు. వేణు హోటళ్లలో వంట పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొంత కాలం క్రితం సొంతంగా టిఫిన్ సెంటర్ కూడా నిర్వహించాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఇటీవల భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. మంగళవారం రాత్రి కూడా భార్యాభర్తల మధ్య తీవ్ర స్థాయిలో గొడవ జరగడంతో, స్రవంతి స్థానికంగానే ఉంటున్న తన తల్లిగారింటికి వెళ్లింది. దీంతో మనస్తాపానికి గురైన వేణుకుమార్‌రెడ్డి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తన చావుకు అత్త, భార్య, మరదలు కారణమని వారి పేర్లు ఉరేసుకున్న గది గోడపై రాశాడు. బుధవారం తెల్లవారుజామున స్రవంతి తిరిగి ఇంటికి వచ్చి చూసేసరికి వేణుకుమార్‌రెడ్డి విగతజీవిగా కనిపించాడు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మతదేహాన్ని భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. వేణుకుమార్‌రెడ్డి అంత్యక్రియలకు వెళ్లిన భార్యాపిల్లలను బంధువులు అడ్డుకోవడంతో స్వల్ప ఘర్షణ చోటుచేసుకుంది. మృతుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్ఐ మల్లయ్య తెలిపారు.

బత్తాయి తోటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు


ఎర్రబెల్లిలో బత్తాయి తోటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తల బృందం

నల్లగొండ రూరల్ : తిరుపతి ఉద్యాన యూనివర్సిటీ నుంచి రంగాపూర్ అంటు బత్తాయి మొక్కలు తీసుకొచ్చి సాగు చేసినా సక్రమంగా దిగుబడి రాకపోవడంతో నాగపూర్ శాస్త్రవేత్తల బృందం బుధవారం నిడమనూరు మండలంలో పలువురు రైతుల బత్తాయి తోటలను క్షేత్రస్థాయిలో పరిశీలించింది. బత్తాయి మొక్కల ఆకులు, కాండం పసుపు రంగులోకి మారుతున్న బత్తాయి కాయలను, మట్టి నమూనాలను శాస్త్రవేత్తలు సేకరించారు. రైతులు పాటిస్తున్న సాగు విధానాలను అడిగి తెలుసుకున్నారు. అంటు కట్టే సమయంలో తల్లి మొక్క నుంచి సరైన కొమ్మలను సేకరించి ఉండకపోవచ్చని శాస్త్రవేత్తలు అనుమానం వ్యక్తం చేశారు. నాగపూర్ పరిశోధన కేంద్రంలో అన్ని రకాలుగా పరీక్షించిన తర్వాతనే నిర్ణయానికి వచ్చి రైతులకు సరైన దిశా నిర్దేశం చేస్తామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ దర్శన్ కడం, నరేష్, తిరుగునాన్నావెల్, కిరణ్‌కుమార్, వెంకట రమేష్, సురేష్‌కుమార్‌రెడ్డి, బాబు, జిల్లా ఉద్యాన అధికారి సాయిబాబా, నకిరేకల్ ఉద్యాన అధికారి అనంతరెడ్డి, నిడమనూరు ఉద్యాన అధికారి మురళి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

హుజూర్‌నగర్: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో బుధవారం 19,317 క్యూసెక్కులుగా నమోదైంది. దీంతో ఒక క్రస్ట్ గేటు 2 మీటర్లు పైకి ఎత్తి స్పిల్‌వే ద్వారా 17,594 క్యూసెక్కుల నీటిని, విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ద్వారా 16వేల కూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 45.77 టీఎంసీలు కాగా ప్రస్తుతం 45.20 టీఎంసీల నీరు ఉంది.

104 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి..

పులిచింతల ప్రాజెక్టులో అంతర్భాగంగా నిర్మించిన తెలంగాణ జెన్‌కో విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో బుధవారం నాలుగు యూనిట్ల ద్వారా 16వేల క్యూసెక్కుల నీటిని వినియోగిస్తూ 104 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసి తెలంగాణ గ్రిడ్‌కు అనుసంధానం చేసినట్లు ప్రాజెక్టు ఎస్ఈ దేశ్యానాయక్ తెలిపారు.